# తారుమారు

రచన :

శ్రీ బి. వి. డి. ప్రసాదరావు

"నిజమా ? !"

"ఊఁ. పెళ్ళయిన రెండేళ్ళకు మనం తల్లి దండ్రులం కాబోతున్నాం ! నాకుమాత్రం భలే ఆనందంగా వుంది. మరి మీకో ?" గుసగుసలాడింది రేవతి, రావు చెవిలో.

రావు గొంతులో తడారిపోతోంది !

రేవతివంక చూస్తూ వుండిపోయాడు.

అతని పరిస్థితి ఘోరంగా వుంది ! నిజమే మరి, ఆత నెప్పుడూ ఇలా జరుగుతోందని వూహించలేదు మరి !—

"అబ్బా, ఏమిటా చూపు ? ఉదయం డాక్టర్‌గారు చెప్పిం దగ్గరినించి మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఎంత తొంద రగా మీ కీ శుభవార్త చెప్పి, మీ కౌగిలిలో, మీ ముద్దుల మధ్య ఉక్కిరి బిక్కిరై పోదామని నాలో ఒకటే ఆరాటం. కానీ మీ కీ వార్త ఇంపుగా లేనట్టుంది."

"ఛీ ఛీ. అదేంకాదు ... రేవతి చిన్నబోతూంటే. రావు, కలగజేసుకొని మాట్లాడేడు - ఎలాగో ?

* * *

రేవతి నిద్రపోయేసరికి అర్ధరాత్రి దాటి రెండుగంట లైంది !

రావుకు నిద్ర రావడంలేదు, ఆలోచనలు అతనిని కుది పేస్తున్నాయి.

'స్లాబ్' వంక చూస్తూ వుండిపోయాడు.

రేవతంటే అతనికి ఏంతో ఇష్టం.

ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు రావు. పెళ్ళి చేసుకొని రేవతిని ప్రేమిస్తున్నాడు.

అతని ప్రేమ చాలా రమ్యమైనది.

ఆటువంటి రావులో, ఇదిగో ఇప్పుడే, రేవతి అంటే ఒకవిధమైన అలజడి రేగుతోంది :—

'ఎందుకిలా జరిగింది ?—ప్రశ్నించుకున్నాడు రావు, సషన్‌గా.

జవాబు దొరకలే దతనికి !

క్షణాలు గంటల్లా దొర్లుతున్నాయి అతనికి.

అతనిలో శ్వాసక్రియ భారంగా జరుగుతోంది.

చలికాలమైనా అతని వంటిమీద చెమట పూత పోస్తోంది.

స్వెటర్ తీసేశాడు.

అతని వంటిలోంచి వేడి బయటకు తన్నుకువస్తోంది..

అతని కళ్ళల్లో నీటిపొరలు ఎప్పటినించో కదలాడు తున్నాయి.....

రేవతివంక చూశాడు రావు.

ఆమె ముడుచుకొని పడుకోనుంది !

ఆమె నెక్కువక్షజాలు చూడలేకపోయాడు !

చూపు మార్చుకొన్నాడు ... ఇప్పు డతనిచూపు 'జీరో' బల్బుపైన వుంది....

అతని మనసుమాత్రం గతంలోకి చూస్తోంది—

* * *

—రావు చదువుకొనే రోజుల్లో....

ఒక 'రేప్' కేసులో ఇరుక్కున్నాడు.

హాస్టల్‌లో, రావు రూం ముందు, స్పృహలేనిస్థితిలో ఒకమ్మాయి పడివుండడం వార్డెన్‌కంట పడింది. అతను పోలీస్ రిపోర్టు ఇచ్చాడు.

రావును పోలీసులు అరెస్ట్ జేశారు ;

'తనకే పాపం తెలీద'ని రావు మొరపెట్టుకున్నాడు. కానీ లాభం లేకపోయింది !

ఆ అమ్మాయికి తెలివి వచ్చింతర్వాత, విషయ మేమిటో చెప్పమన్నారు పోలీసులు.

ఆ అమ్మాయి—తను హాస్టల్‌వద్దకు వచ్చేసరికి, ఎవరో ముసుగువేసి, తనను ఎక్కడకో లాక్కుపోయారని. ఏదో ఇంజెక్షన్ బలవంతంగా ఇచ్చారని, తర్వాత ఏమైందో తనకు తెలీదని—చెప్పింది.

ఆ అమ్మాయికి వైద్యపరీక్షలన్నీ చేసి—మత్తుమందు ఇచ్చి, ఎవరో ఆమెను 'రేప్' జేశారని—మెడికల్ రిపోర్టు ఇచ్చారు డాక్టర్లు !

రావు 'స్పెర్మ్'ను పరీక్షజేయడానికి ప్రయత్నించినప్పుడు అసలువిషయం ఒకటి బయటపడింది ... రావు 'తండ్రి' అయ్యే అవకాశం లేదని తెలిసింది !

తర్వాత—రావు, ఆ 'రేప్' కేసులో నిర్దోషిగా విడుద అయ్యాడు.


ఆ కేసు, ఆ తర్వాత, అసంపూర్ణంగానే ముగిసింది:—

రావు గతంలోంచి బయటపడ్డాడు....

* * *

రావులో ఆవేశం బుసలుకొడుతోంది.

'రేవతి ఎలా 'తల్లి' అవుతోంది ?'—ప్రశ్నించు కున్నాడు రావు.




తనకు జవాబు తెలీని ప్రశ్న అది ! తనకు తెలిసిం దొక్కటే. తనవలన ఆమె 'తల్లి' కాలేదు ? —మరి ?— ఎవడు ! . ఆమెను 'తల్లి'గా జేస్తున్న 'దొంగ' ఎవడు ?-

కొంతసేపటికి, రావు సమాధానపడ్డాడు. 'వాడెవడైతే తనకెందుకు !' .. 'తన రేవతి ఇష్టపడకపోతే, వాడెవడో, ఆమెవేపు చూసేవాడా ? !'

'నిజమే ! మరి. రేవతి ఇంత నీచురాలా?....ఛ ఛ' —

'తనెంతగా ప్రేమించాడు ? తనెంతగా ఆరాదించాడు ?- ఛీ ఛీ— రేవతి ఇంత పాపిష్టిదా ?'—

—తనలో లోపం, తనింటి వారందరికీ తెల్సు !

నిజానికి, తనలో లోపం, తనకు తెలిసినప్పటినించి, రావు పెళ్ళంటే అయిష్టత చూపేవాడు. కానీ తనంటి వారంతా....పెద్దవాడివై వుండి, నీకు పెళ్ళికాకపోతే, నీ తోడపుట్టినవారికి పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి ? సంబంధాలు ఎలా వస్తాయి ? !'....అంటూ వెధవ సెంటిమెంట్స్‌తో రావు నోరును మూసేశారు. అతనికి - రేవతితో పెళ్ళి జేసేశారు !

ఇప్పుడు రేవతి 'గర్భవతి'ని తెలిస్తే, తనవారంతా; తనను, రేవతిని ఎలా తమ మధ్య తిప్పుకుంటారు ? ఎలా తమను ట్రీట్ చేస్తారు ? !—

ఇక, తనుమాత్రం—రేవతిని ఇదివరకటిలా ప్రేమించ గలడా! ఆమెతో స్వేచ్ఛగా తిరగగలడా ? !—

ఆలోచనలలో వుండిపోయాడు రావు—

చాలాసేపటికి, ఒకనిర్ణయానికి వచ్చేశాడు.

* * *

తెల్లవారకముందే - తన బలాన్నంతా ఉపయోగించి, ముక్కు, నోరు మూసేసి, వూపిరాడనివ్వకుండా జేసి— రేవతిని హత్య జేసేశాడు !

తర్వాత, తడిగుడ్డతో ఆమెమొహాన్ని బాగా తుడిచేశాడు. విడిపించుకోడానికి ప్రయత్నంచేస్తూ, రేవతి కాళ్ళూ చేతులు కొట్టుకునేసమయంలో, చెరిపోయిన ఆమె బట్ట లను, మంచంమీద దుప్పటిని సర్దేసి, తను స్వెటర్‌ను వేసుకొని, ఏమీ తెలీనట్టు నటించడం మొదలుపెట్టాడు రావు....

ముందుగా, గోలగా ఏడుస్తూ నటనను మొదలుపెట్టాడు.

తనవారంతా వచ్చారు - ఎవరి గదుల్లోంచి వారు లేస్తూ, ఆతృతగా !

రేవతి మరణవార్త, రావుద్వారా విని, వారంతా 'షాక్' తిన్నారు !—

పడుకుంటూ రేవతి చెప్పింది, 'వంట్లో నలతగా వుం దని'... నేను ఏమో అనుకున్నాను. కానీ ఇలా జరుగు తోందని అనుకోలేదు. కథ అల్లడం ప్రారంభించాడు రావు- ఏడుపు ఆపి !

రేవతి మంచితనాన్ని అందరూ గుర్తుకు తెచ్చుకుంటూ ఏడుస్తున్నారు.

—రేవతి తల్లి దండ్రులు, రావు తండ్రి ఇచ్చిన టెలి గ్రాం చూసుకొని వచ్చేసరికి, పదిగంటలు ధాటుతోంది.

అప్పుడే ఫోన్ మ్రోగింది.

ఉలిక్కిపడి, లేచి కూర్చున్నాడు రావు. చుట్టూ చూశా డు. ఏం (కా) లేదు.

ఇంతవరకు జరిగింది - తను కన్న కల !

'గాడ్ ! ఏమిటీ కల ? ఎందుకొచ్చింది ఇలా ? !'— తల పట్టుకున్నాడు రావు.

అప్పుడప్పుడే తెల్లవారుతోంది....

లేచి, యాంత్రికంగా తన పనులన్నింటినీ ముగించు కొని, ఆఫీసుకు వెళ్ళిపోయాడు రావు.

ఎంతగా ప్రయత్నిస్తున్నా ఏపని చెయ్యలేకపోతున్నాడు: అంతవరకు తన చుట్టూవున్న ఆలోచనను బలవం తంగా ప్రక్కకునెట్టి, ఇంటికి ఫోన్‌చేశాడు రావు—

'హలో !'

'............'

'అమ్మా ! నేను రావుని. నిన్న చూసిన పెళ్ళి సంబం ధాన్ని కాన్సిల్ చేసేయలడి. లేదా, నాలో లోపాన్నయినా వాళ్ళకు తెలియపర్చండి. మరేం మాట్లాడకు. మీరు నా సంసారజీవితం సాఫీగా, హాయిగా సాగిపోవాలనుకుంటే ఈ రెండింటిలో ఏదో ఒకటి చెయ్యండి. ప్లీజ్ !... ప్లీజ్ !....'